# మార్కెట్‌లోకి వోక్స్‌వ్యాగన్ టైగున్ ఫేస్‌లిఫ్ట్!

■ కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభించిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, పీసీసీ నేత శ్రీనుబాబు



**ప్రజానావ, కరీంనగర్:** పీపీఎస్ మోటార్స్ వోక్స్ వాగన్ టైగున్ ఫేస్ లిఫ్ట్ మోడల్ నూతన వాహనాన్ని బుధవారం కరీంనగర్ పట్టణం కోతిరాంపూర్‌లో గల వోక్స్ వాగన్ షో రూమ్‌లో కరీంనగర్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 స్టార్ గ్లోబల్ ఎన్ క్యాప్ రేటింగ్, చైల్డ్ సేఫ్టీ ఫైవ్ స్టార్ రేటింగ్ భద్రత ప్రమాణాలు పాటిస్తూ ఆధునిక డిజైన్, నూతన టెక్నాలజీ, అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు, శక్తివంతమైన పనితీరుతో రూపొందిన టైగున్ ఫేస్ లిఫ్ట్ వాహనం బాగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పడిశెట్టి వసంత భూమయ్య, మాసం గణేష్, ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బుర్ర సంజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్, ప్రశాంత్, నారోజు రాకేష్ చారి, బద్దం ప్రవీణ్ రెడ్డి మల్లేశం, క్రాంతి కుమార్, వోక్స్ వాగన్ జనరల్ మేనేజర్ నాగార్జున రెడ్డి, క్లస్టర్ హెడ్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది బద్రి లక్ష్మణ్, గుర్రం రాజు రెడ్డి, సైదులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు .

## కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలి



**ప్రజానావ, సిరిసిల్ల :** కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశించారు. కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కుహజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అటవీ శాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి బుధవారం హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత సమయంలో అనుమతులు జారీ చేయాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో త్వరగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టీజీ ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నిర్వహించి పరిశ్రమల స్థాపన, టీజీ ఐపాస్, టీ- ప్రైడ్ పై సంబంధిత శాఖల అధికా రులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాలో టీజీ ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. టీ ప్రైడ్ కింద 27 దరఖాస్తులు రాగా, అనుమతులు జారీ అయ్యాయి. టీజీ ఐ పాస్ కింద 49 దరఖాస్తులు రాగా, ఇప్పటిదాకా 31 అనుమతులు జారీ చేయగా, మిగతావి వివిధ శాఖల అనుమతులు రావాల్సి ఉంది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను నిబంధనల మేరకు సకాలంలో అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులను సమీక్షించారు. నూతన పరిశ్రమలకు నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయాలని, దీంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం

■ ప్రధాని మోడీపై అవగాహన వాక్యాలపై బీజేపీ శ్రేణుల నిరసన



**ప్రజానావ, సిరిసిల్ల :** దేశ ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్న ప్రధాన మంత్రిపై అసభ్య, అవమానకర వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించే చర్య అని బీజేపీ పట్టణ అధికార ప్రతినిధి చొప్పదండి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధికార ప్రతినిధి చొప్పదండి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలు సిద్ధాంతాలపై ఉండాలని వ్యక్తిగత దూషణలు, తక్కువ స్థాయి వ్యాఖ్యలు చేయడం దేశ రాజకీయ సంస్కృతిని దిగజార్చే చర్య అని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తునామని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా ఉండాలని హెచ్చరిక హెచ్చరించారు. దేశ గౌరవాన్ని కించపరిచే ఎలాంటి ప్రయత్నాన్నైనా భారతీయ జనతా పార్టీ తగిన విధంగా ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు మోర శ్రీహరి, పట్టణ ప్రధాన కార్యదర్శి మేర్గు మెరుగు శ్రీనివాస్, ఆంకారపు రాజు, నరసయ్య, కనకయ్య, సూరం వినయ్, దూడం సురేష్, గాలి శ్రీనివాస్, కోడం రవి తదితరులు పాల్గొన్నారు.



## ఈత సరదా ప్రాణం తీయొద్దు

పిల్లల కదలికలపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలి

వేసవి సెలవుల వేళ అప్రమత్తత అవసరం

మైనర్లకు వాహనాలిస్తే జైలుకే!

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరిక

**ప్రజానావ, సిరిసిల్ల:** వేసవి సెలవుల వేళ పిల్లలు, యువతలో ఉండే ఉత్సాహం విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఈత కోసం సమీపంలోని చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లే అవకాశం ఉందని, ఈ క్రమంలో ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణనష్టం జరిగే ముప్పు పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సరదా కోసం చేసే పనులు ప్రాణాల మీదకు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ఈత రాని పిల్లలు బావులు, కాలువల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ కోరారు. ఈత నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారు తప్పనిసరిగా పెద్దల సమక్షంలోనే ఉండాలని, నీటి వనరుల వద్దకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం మొత్తం కోలుకోలేని దెబ్బతింటుందని, కాబట్టి చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించవద్దని ఆయన హెచ్చరించారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అవగాహన లేని వయసులో వాహనాలు నడపడం వల్ల డ్రైవర్లకే కాకుండా ఎదుటి వ్యక్తులకు కూడా ప్రాణాపాయం కలుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడ్డా లేదా వారు నడిపే వాహనం వల్ల ప్రమాదం జరిగినా, సదరు వాహన యజమానిపైనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, తమ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు ఇవ్వకూడదని ఎస్పీ గితే స్పష్టం చేశారు.

## ముగిసిన వేములవాడ కో-ఆప్షన్ నామినేషన్ల పర్వం

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల సందడి కీలక ఘట్టానికి చేరుకుంది. ఈ ప్రక్రియలో భాగంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు నిర్ణయించిన గడువు బుధవారం ఏప్రిల్ 22తో ముగిసింది. చివరి రోజు కావడంతో ఆశావహులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. మొత్తం ప్రక్రియ ముగిసే సమయానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. మున్సిపల్ కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం కో-ఆప్షన్ సభ్యత్వాల కోసం మొత్తం 22 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో జనరల్ కేటగిరీ కింద మొత్తం 12 నామినేషన్లు రాగా, అందులో మహిళల నుంచి 7 మరియు పురుషుల నుంచి 5 దరఖాస్తులు అందాయి. ఇక మైనారిటీ కేటగిరీ విషయానికి వస్తే మొత్తం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 3 మహిళా అభ్యర్థులు ఉండగా, ఏడుగురు పురుషులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

## ప్రియుడి భార్యను చంపిన ప్రియురాలు

**ప్రజానావ, ముంబై :** ఛత్రపతి సంభాజీనగర్‌లోని బజాజ్‌నగర్ ప్రాంతంలో ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. ప్రియుడి భార్యతో జరిగిన గొడవ నేపథ్యంలో, ఒక మహిళ ఇంట్లోకి దూసుకెళ్లి కత్తితో దాడి చేసి ఆమెను హత్య చేసింది. ఘటన అనంతరం పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా భయాందోళనలకు కారణమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## షోలాపూర్‌లో తెలుగు శిక్షణా తరగతులు ప్రారంభం



**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని షోలాపూర్లో తెలుగు భాషా అభివృద్ధి పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో తెలుగు పఠన, రచన శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 20 నుండి మే 25, 2026 వరకు ఈ తరగతులు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ చిప్ప విజయ్ తెలుగు భాష నేర్చుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. లైబ్రరీ అధ్యక్షుడు కంఠం మల్లికార్జున్ మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన కార్పొరేటర్ గుర్రం సత్యనారాయణ తెలుగు చదవడం-రాయడం నేర్చుకోవడం అవసరమని అన్నారు. ఉపాధ్యాయురాలు గూడూరు రాజలక్ష్మి తరగతులను ప్రారంభించగా, కార్యక్రమంలో పలువురు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

